సాక్షి
వైఎస్ఆర్ జిల్లా
సోమవారం । 6 । నవంబర్ । 2023



హాకీ విజేత కడప జట్టు
అనకాపల్లి జిల్లాలో నిర్వహించిన అండర్-17 ఏపీ అంతర్ జిల్లాల హాకీ టోర్నమెంట్‌లో వైఎస్ఆర్ జిల్లా బాల, బాలికల జట్లు విజేతలుగా నిలిచాయి. -8లో



కాలుష్యం కాదు.. కాంతులు కావాలి
పండుగ కాలుష్య కారకం కాకూడదని దీపావళి కాంతులు మాత్రమే చాలునని పర్యావరణ నిపుణులు పేర్కొంటున్నారు. -8లో

గరిష్టం/కనిష్టం
32.5/24.3

వాతావరణం
జిల్లాలో శనివారం 24.3 – 32.5 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 1.8 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
-కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

స్వామిత్వ కార్యక్రమం వేగవంతం

కడప సెవెన్‌రోడ్స్: జిల్లాలో స్వామిత్వ కార్యక్రమాన్ని వేగవంతం చేస్తున్నామని, తమ వంతు బాధ్యతగా ప్రజలు సహకరించాలని జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్‌రెడ్డి ఓ ప్రకటనలో కోరారు. గ్రామ కంఠంలోని ప్రభుత్వ, వ్యక్తిగత, ఖాళీ స్థలాల వివరాలను గ్రౌండ్ ట్రూతింగ్ సర్వేకు వచ్చిన అధికారులకు తెలుపాలన్నారు. వారు వచ్చినపుడు తమ వద్ద నున్న డాక్యుమెంట్ నకళ్లు అందజేయాలని సూచించారు. ప్రభుత్వం సమగ్ర భూసర్వేతోపాటు గ్రామ కంఠం ఆస్తుల సర్వే చేపట్టిందన్నారు. ఇందుకు సంబంధించి అధికారులతో పలు బృందాలు ఏర్పాటుచేశామన్నారు. అనుభవందారులకు ఆస్తులపై యాజమాన్య హక్కులు కల్పిస్తామన్నారు. బ్యాంకుల్లో ఆస్తులు తనఖా పెట్టి రుణ సదుపాయం పొందే అవకాశం ప్రజలకు ఉంటుందన్నారు.

మహిళా క్రికెట్ జట్టుకు ప్రశంస



కడప స్పోర్ట్స్: ఉమన్స్ అండర్–15 ఆంధ్రా మహిళల జట్టుకు జిల్లాకు చెందిన క్రీడాకారిణి వి.ప్రశంస ఎంపికయ్యారు. మంగళగిరిలో నిర్వహించిన అంతర్ జోన్ క్రికెట్ మ్యాచ్‌లో ప్రతిభ కనబరచడంతో ఏపీ జట్టుకు ఎంపికైంది. ఎడమచేతి వాటంగల బ్యాట్ ఉమన్‌గా, బౌలర్‌గా నవంబర్ 17 నుంచి బరోడాలో నిర్వహించనున్న బీసీసీఐ ఉమన్స్ అండర్–15 వన్డే ట్రోఫీలో ఆంధ్రా జట్టు నుంచి ఆమె ప్రాతినిధ్యం వహించనున్నారు. జిల్లాకు చెందిన క్రీడాకారిణి ఆంధ్రా జట్టుకు ఎంపిక కావడంతో క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ వైఎస్ఆర్ డిస్ట్రిక్ట్ (సీఏవైడీ) అధ్యక్షుడు ఎం.భరత్‌రెడ్డి, కార్యదర్శి ఎ.రెడ్డిప్రసాద్, ఆపరేషన్స్ డైరెక్టర్ ఖాజా మైనుద్దీన్, ఉమన్ క్రికెట్ కోఆర్డినేటర్ కల్యాణదుర్గం విష్ణుమోహన్‌రావు సంతోషం వ్యక్తం చేశారు.

రోల్‌బాల్‌కు ఎంపిక



రోల్ బాల్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

ప్రొద్దుటూరు కల్చరల్: స్థానిక రాయలసీమ వ్యాయామ కళాశాలలో ఆదివారం ఎస్జీఎఫ్ జిల్లా స్థాయి రోల్‌బాల్ ఎంపికలు నిర్వహించారు. ఈ ఎంపికలకు 55 మంది క్రీడాకారులు హాజరయ్యారు. అండర్–14 బాలుర విభాగంలో భవితకుమార్‌రెడ్డి, కుమార్‌స్వామి, మనోజ్, బాలాజీ, జశ్వంత్, నిఖిలేష్, హర్షకుమార్, కల్యాణ్, రామ్‌కుమార్, దినేష్‌కుమార్ రెడ్డి, బాలికల విభాగంలో మోహన, భవ్యశ్రీ, అఖిల, అనుష్క, అమృత, ఐశ్వర్య, వినుష్క, అండర్–17 బాలుర విభాగంలో మహమ్మద్ రుస్తుం, సుధీర్, జశ్వంత్, నిఖిల్, లోకేష్, వరుణ్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. రోల్‌బాల్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ పవన్ కళ్యాణ్, ఎస్జీఎఫ్ కార్యదర్శి అరుణకుమారి, జిల్లా సహాయ కార్యదర్శి బత్తల నిత్యప్రభాకర్, శివారెడ్డి, సురేష్, శిక్షకులు నాగేశ్వరరావు, అర్షమతుల్లా తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీ ధరలకే మద్యం అమ్మకాలు

కడప వైఎస్ఆర్ సర్కిల్: జిల్లాలోని ప్రభుత్వ మద్యం దుకాణాల్లో ఎమ్మార్పీ ధరలకే మద్యం విక్రయిస్తున్నట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ గోపాల్ తెలిపారు. నగరంలోని తన కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నంద్యాల నుంచి విజిలెన్స్ కమిటీ తనిఖీలు నిర్వహించగా, ఎక్కడా అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు బయట పడలేదన్నారు. జిల్లా స్క్వాడ్ తనిఖీ చేసి అక్రమాలు జరగలేదని నిర్ధారించిందన్నారు.

డిసెంబర్ 17న భగవద్గీత పోటీలు

రాజంపేట టౌన్: ఈ ఏడాది డిసెంబర్ 17వ తేదీ గీతాజయంతిని పురస్కరించుకొని రాయచోటిలోని శ్రీసాయి ఇంజినీరింగ్ కళాశాలలో జిల్లాస్థాయిలో భగవద్గీత పోటీలను నిర్వహించనున్నట్లు టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్ ధర్మాచార్యులు గంగనపల్లె వెంకటరమణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. టీటీడీ, హిందూ ధర్మప్రచార పరిషత్ అన్నమయ్యజిల్లాశాఖ ఆధ్వర్యంలో ఈ పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 6, 7వ తరగతి విద్యార్థులు జూనియర్స్ విభాగంలో 8, 9వ తరగతి విద్యార్థులు సీనియర్స్ విభాగంలో భగవద్గీత మూడో అధ్యాయం కర్మయోగంలోని ముప్పై శ్లోకాలు కంఠస్థం చేసి చెప్పాల్సి ఉంటుందన్నారు. సంపూర్ణ భగవద్గీత శ్లోకాలపై 18 సంవత్సరాలలోపు విద్యార్థులు జూనియర్స్ విభాగంలో, 18 సంవత్సరాలు పైబడిన వారు సీనియర్స్ విభాగంలో 701 శ్లోకాలు చెప్పాల్సి వుంటుందన్నారు. ఈ పోటీల్లో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొనవచ్చన్నారు. వివరాలకు టీటీడీ, హిందూ ధర్మప్రచార పరిషత్ జిల్లా ప్రోగ్రామ్ అసిస్టెంట్ గోపీబాబు ఫోన్ నంబర్ 9110779066లో సంప్రదించాలని కోరారు.

అన్నదాతకు ఆర్థిక అండ

గ్రామీణ పేదలకు మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం వెన్నుదన్నుగా నిలుస్తోంది. ఎంతో మంది నిరుపేదల పొట్ట నింపడమేగాక, చిన్న, సన్న కారు రైతులకు ఆర్థిక అండగా నిలుస్తోంది. బీడు భూములు సాగులోకి తెచ్చుకుని రైతులు లాభాలు గడించేలా డ్రైల్యాండ్ హార్టికల్చర్‌కు ప్రోత్సాహం అందిస్తోంది. దీంతో ఉద్యాన పంటల సాగు గణనీయంగా పెరుగుతోంది.

- ఉపాధి హామీ పథకం కింద పండ్లతోటల పెంపకం
- ఈ ఏడాది సాగు లక్ష్యం 3 వేల ఎకరాలు
- చీనీ పంట సాగుకు పులివెందుల రైతుల మొగ్గు



సాగులో ఉన్న చీనీ పండ్ల తోట

కడప సిటీ: జిల్లాలో ఉద్యాన పంటల సాగుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సాహం అందిస్తున్నాయి. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్.రాజశేఖరరెడ్డి డ్రై ల్యాండ్ హార్టికల్చర్‌కు శ్రీకారం చుట్టారు. ఇపుడు ఆయన తనయుడు సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఉద్యాన సాగుపై శ్రద్ధ చూపుతూ రైతులకు అండగా నిలుస్తున్నారు. 2023–24 ఆర్థిక సంవత్సరానికి జిల్లాలో 3వేల ఎకరాల్లో పండ్ల తోటలను సాగు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అయితే అంతకు మించి ఇప్పటి వరకు 3093 ఎకరాల బీడు భూముల్లో ఉద్యాన పంటల సాగుకు 1250 మంది రైతులు దరఖాస్తు చేసుకున్నారు. స్పందించిన అధికారులు 1060 మంది రైతులకు మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకం కింద చేయూతనివ్వగా 2506 ఎకరాల్లో పండ్ల మొక్కలు నాటారు. 190 మంది రైతులు మాత్రం ఇంకా మొక్కలు నాటుకోవాల్సి ఉంది.

ఏయే పండ్ల తోటలంటే?

ఉపాధి హామి పథకంలో హార్టికల్చర్ కింద మామిడి, సన్న నిమ్మ, జామ, సపోట, నేరెడు, సీతాఫలం, కొబ్బరి, డ్రాగన్ ఫ్రూట్, మల్లె, మునగ, దానిమ్మ, చీనీ, ఆపిల్‌బేర్ వంటి 13 రకాల పండ్ల తోటలు సాగు చేసుకునే అవకాశం ప్రభుత్వం కల్పించింది. పండ్ల తోటలకు మూడేళ్ల వరకు నిర్వహణ ఖర్చులను ఆయా పంటలను బట్టి పూర్తిగా ఉచితంగా అందజేస్తోంది. గుంతలు తీయడం మొదలుకొని మొక్కలు నాటడానికి, పొలం దున్నడానికి, అంతర పంటగా వేసుకోవడానికి, కాపలాదారుకు, ఎరువులకు అయ్యే ఖర్చును ప్రభుత్వమే భరిస్తోంది. సాగుచేసే పంటను బట్టి రూ. 90 వేలనుంచి ఎకరాకు రూ.2 లక్షల వరకు చెల్లిస్తోంది. వర్షాలు సంవృద్ధిగా కురిస్తే రైతులు దీనిని సద్వినియోగం చేసుకుంటారని రైతులు చెబుతున్నారు.

పులివెందులదే అగ్రస్థానం

పులివెందుల నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాలు చీనీ తోటల పెంపకానికి అనుకూలం. ఇప్పటికే జిల్లాలో పండ్ల తోటల సాగు అధికంగా ఉంది. 2023–24 ఈ ఆర్థిక సంవత్సరంలో పులివెందుల నియోజకవర్గానికి చెందిన రైతులే ఎక్కువగా ఉపాధి హామీ పథకంలో చీనీ పంటలు సాగు చేసుకునేందుకు ముందుకువచ్చారు. 3000 ఎకరాలలో పండ్ల తోటల సాగు లక్ష్యం కాగా, ఇందులో 1800 ఎకరాల్లో చీనీ పంట సాగుకు పులివెందుల రైతులు మొగ్గు చూపారు. మిగిలిన పంటలకు ఆయా రైతులు దరఖాస్తు చేసుకున్నారు.



రైతులు మొగ్గు చూపుతున్నారు



జిల్లాలో పండ్ల తోటల సాగుకు రైతులు మొగ్గుచూపుతున్నారు. దరఖాస్తు చేసుకునేందుకు ముందుకు వస్తున్నారు. ఈ ఏడాది లక్ష్యానికి మించి రైతులు సాగు చేసేందుకు శ్రద్ధ కనబరుస్తున్నారు. ఉపాధి హామీ పథకం కింద పండ్ల తోటల సాగు పూర్తిగా ఉచితం. మొత్తం ప్రభుత్వమే ప్రోత్సాహం అందిస్తోంది. వర్షాలు పుష్కలంగా కురిస్తే రైతులకు మరో అవకాశం ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటాం.
– పి.యదుభూషణరెడ్డి, ప్రాజెక్టు డైరెక్టర్, డ్వామా, కడప

పండ్ల తోటల సాగుకు ప్రభుత్వ ప్రోత్సాహం వివరాలిలా!

మొక్క రకం	అందించే మొక్కలు	అంచనా వ్యయం (రూ.లలో)
మునగ నర్సరీ	5000	31,111
మునగ సాగు	448	86,614
రోజ్ గార్డెన్	2000	2,00,652
జాస్మిన్ గార్డెన్	1600	1,73,122
మ్యాంగో	70	1,03,193
బత్తాయి	100	1,07,459
నిమ్మ	110	1,27,451
తైవాన్ జామ	444	2,26,783
సపోట	60	90,027
కొబ్బరి	60	90,610
సీతాఫలం	240	1,82,480
దానిమ్మ	267	2,44,819
నేరెడు	20	41,912
బేర్ ఆపిల్	320	1,08,338
డ్రాగన్ ఫ్రూట్	900	1,84,533

కార్తీక మాసం స్పెషల్ బస్సులు



మదనపల్లె సిటీ: కార్తీకమాసం పురస్కరించుకుని స్పెషల్ బస్సు సర్వీసులు నడపనున్నట్లు మదనపల్లె ఆర్టీసీ– 2 డిపో మేనేజర్ ఆర్‌సీ నిరంజన్ తెలిపారు. ఈ నెల 19, 25, డిసెంబర్ 3 తేదీల్లో ప్రముఖ శైవక్షేత్రాలైన యాగంటి, మహానంది, శ్రీశైలం, పుష్పగిరి, రాయచోటి వీరభద్రస్వామి ఆలయాలకు బస్సులు నడపనున్నట్లు చెప్పారు. మదనపల్లె నుంచి ఉదయం 5 గంటలకు బయలుదేరి మరుసటి రోజు మదనపల్లెకు చేరుకుంటాయన్నారు. రాను,పోను చార్జీ రూ.2000 చెల్లించాలన్నారు. ఈ నెల 20,26, డిసెంబర్ 4 తేదీల్లో మదనపల్లె డిపో నుంచి మొగిలి, తొండవాడ,గుడిమల్లం, శ్రీకాళహస్తి లో దర్శనం అనంతరం అదే రోజు రాత్రి మదనపల్లెకు చేరుకుంటుందన్నారు. రాను,పోను చార్జీ రూ.700 చెల్లించాలన్నారు. వివరాలకు 9959225677, 91601 86645 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

నేడు జాబ్‌మేళా

సిద్దవటం: మండల కేంద్రమైన సిద్దవటంలోని మండల సమాఖ్య కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటలకు జాబ్ మేళా జరుగుతుందని ఎంపీడీఓ జవహర్ బాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ , ఉపాధికల్పన, వ్యవస్థాపక అభివృద్ధి సంస్థ వారి ఆధ్వర్యంలో డిక్సన్ కంపెనీలో మహిళా అభ్యర్థులకు ఉద్యోగాల కోసం ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నారన్నారు. గ్రామీణ ప్రాంత నిరుద్యోగ యువతులు మాత్రమే హాజరు కావాలన్నారు. ఈ కంపెనీలో మూడు రకాల ఉద్యోగాలు ఉన్నాయన్నారు. గ్రాడ్యుయేట్ ఇంజినీర్ ట్రైనీ ఉద్యోగం కోసం బీటెక్ పాసై ఉండాలన్నారు. డిప్లమా ఇంజినీర్ ట్రైనీ ఉద్యోగానికి డిప్లమా లేదా ఐటీఐ పాసై ఉండాలన్నారు. అసెంబ్లీ ఆపరేటర్ ఉద్యోగానికి ఎస్ఎస్‌సీ, ఇంటర్, డిగ్రీ పాసై ఉండాలన్నారు. ఆసక్తి గల వారు విద్యార్హత సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు ఒరిజనల్, జిరాక్స్ కాపీలు, 2 ఫోటోలు, తీసుకొని ఇంటర్వ్యూలకు హాజరు కావాలన్నారు.

చంద్రబాబు అంటే స్కాములే గుర్తుకొస్తాయి



ప్లకార్డులు పట్టుకొని నినాదాలు చేస్తున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, తదితరులు

ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి.అంజద్ బాషా

కడప కార్పొరేషన్: ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అంటే స్కీములు, చంద్రబాబు అంటే స్కాములు గుర్తుకువస్తాయని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి.అంజద్‌బాషా ఎద్దేవా చేశారు. కడప నగరంలోని 23వ డివిజన్‌లో ఆదివారం 'గడప గడపకు మన ప్రభుత్వం' ముగింపు కార్యక్రమం నిర్వహించారు. స్థానిక మురళీ థియేటర్ సర్కిల్‌లో 'జగనన్నను మళ్లీ సీఎం చేద్దాం' అంటూ జనం పెద్ద ఎత్తున ప్లకార్డులు పట్టుకొని నినదించారు. బాణసంచా కాల్చి సంబరాలు చేశారు. డిప్యూటీ సీఎంను గజమాలతో సత్కరించారు. అనంతరం విలేకరులతో అంజద్‌బాషా మాట్లాడుతూ 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం రాష్ట్రంలోనే ఉందని, దేశంలో మరెక్కడా లేదన్నారు. ప్రతి డివిజన్‌లో మౌలిక సదుపాయాల కల్పనకు రూ.40 లక్షలు వినియోగిస్తున్నామన్నారు. అర్హత ఉండి పథకాలు అందుకోలేకపోయిన వారికి ఎంతో మేలు జరుగుతోందన్నారు. గతంలో ఇదే బడ్జెట్ ఉన్నా చంద్రబాబు ప్రజలకు మేలు చేయలేకపోయారని, దోచుకొని, దాచుకోవడమే పనిగా పెట్టుకున్నారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు మంచి చేస్తుంటే ప్రతి పక్షాలు ఓర్వలేకపోతున్నాయన్నారు. స్కిల్ స్కాంలో కోట్లు దండుకున్న చంద్రబాబు గురించి బీజేపీ అధ్యక్షురాలు పురంధేశ్వరి అనుకూలంగా మాట్లాడడం దారుణమన్నారు. రాష్ట్రంలో టీడీపీ, బీజేపీ, జనసేన కలశాయని, రాబోయే ఎన్నికల్లో వామపక్షాలతో కలిసి పోటీ చేసినా వైఎస్సార్‌సీపీ ఒంటరిగానే పోటీచేసి విజయం సాధిస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. తమ ప్రభుత్వంలో మంచి జరిగి ఉంటేనే ఓటేయమని తాము ధైర్యంగా అడుగుతున్నామని, అలా అడిగే దమ్ము టీడీపీకి ఉందా... అంటూ ఆయన ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో తుంగా విజయలక్ష్మి, ఐస్‌క్రీం రవి, జయచంద్రారెడ్డి, బీహెచ్. ఇలియాస్, రామ్మోహన్‌రెడ్డి, షఫీ, షఫీవుల్లా, మూలే సరస్వతి, రత్నకుమారి, పత్తిరాజేశ్వరి, టీపీ.వెంకటసుబ్బమ్మ, సునీత తదితరులు పాల్గొన్నారు.

సేవాతత్పరుడు ఆకేపాటి

- సమావేశంలో వక్తలు
- 4వేల మందికి వైద్య సేవలు

రాజంపేట రూరల్: నిత్యం ప్రజల కోసం సేవా కార్యక్రమాలు నిర్వహించే సేవాతత్పరుడు జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి అని, సేవతో ఆయన జీవితం ధన్యమైందని పలువురు వక్తలు కొనియాడారు. మండల పరిధిలోని ఆకేపాటి ఎస్టేట్‌లో తిరుపతి బర్డ్స్ హాస్పిటల్ సహకారంతో ఆదివారం జెడ్పీ చైర్మన్ ఆకేపాటి ఆధ్వర్యంలో ఉచిత మెగా ఆర్థో వైద్యశిబిరం నిర్వహించారు. 11 ప్రజలకు మండలాల వారీగా బస్సులతో పాటు ఉదయం, మధ్యాహ్నం వేలాది మందికి ఆకేపాటి భోజన వసతి కల్పించారు. చైన్నై, బెంగళూరు, హైదరాబాదు, తిరుపతి వంటి నగరాల్లో బర్డ్ వైద్యశాలలో వైద్యం అందించే 35 మంది ప్రముఖ వైద్య నిపుణులు వైద్య సేవలు అందించారు. ఈ వైద్య శిబిరంలో ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ సి. రామచంద్రయ్య, రాయచోటి, రాజంపేట, రైల్వే కోడూరు ఎమ్మెల్యేలు గడికోట శ్రీకాంత్‌రెడ్డి, మేడా మల్లికార్జునరెడ్డి, కొరముట్ల శ్రీనివాసులు, కడప నగర్ మేయర్ కొత్తమద్ది సురేష్‌బాబు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎం.రామచంద్రారెడ్డి, టీటీడీ బోర్డు సభ్యుడు యానాదయ్య, రెడ్డెప్పరెడ్డి, స్కిల్ డెవలప్‌మెంట్ చైర్మన్ కొండూరు అజయ్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసులరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజా సేవ చేసేందుకు రాజకీయాల్లోకి వచ్చి నిస్వార్థంగా సేవలందిస్తున్న నిజమైన రాజకీయ నాయకుడు ఆకేపాటి అని ప్రశంసించారు. రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ సేవే పరమావధిగా జీవిస్తున్న ఆకేపాటి సేవాతత్పురుడని చెప్పారు. రైల్వేకోడూరు ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రజలకు సేలందించే ఆకేపాటి మన ప్రాంతంలో జన్మించడం మనకు దేవుడిచ్చిన వరమన్నారు. ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి మాట్లాడుతూ ప్రజా సేవ కోసమే జీవిస్తున్న ఆకేపాటి కుటుంబానికి ఆ దేవుడు అండగా ఉండాలని ఆకాంక్షించారు. టీటీడీ బోర్డు సభ్యుడు యానాదయ్య మాట్లాడుతూ వేలాది మందికి సేవ చేసే అదృష్టం ఆకేపాటికి దక్కటం పూర్వజన్మ సుకృతమన్నారు. కడప నగర్ మేయర్ కే సురేష్‌బాబు మాట్లాడుతూ 4వేల మందికి ఒకేసారి వైద్య సేవలు అందించడం ఆకేపాటి కుటుంబానికి మాత్రమే సాధ్యమైందన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ చైర్మన్ కొండూరు అజయ్‌రెడ్డి మాట్లాడుతూ సేవా కార్యక్రమాలు నిర్వహించడంలో ఆకేపాటి ఆదర్శప్రాయుడని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, ఆకేపాటి సోదరుడు ఆకేపాటి అనిల్‌కుమార్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పంజం సుకుమార్ రెడ్డి, జిల్లా టూరిజం డైరెక్టర్ గుంటిమడుగు సుధాకర్‌రాజు, డీఎంఅండ్‌హెచ్‌ఓ కొండయ్య, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ ఎస్.చిన్నకృష్ణ, మున్సిపల్ వైస్ చైర్మన్ మర్రి రవి, వైఎస్సార్‌సీపీ నాయకులు చొప్పా యల్లారెడ్డి, మల్లారెడ్డి, ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి, గాలివీటి రాజేంద్రనాథరెడ్డి, మిరియాల సురేఖ తదితరులు పాల్గొన్నారు.



ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్న బర్డ్ వైద్య నిపుణులు



మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి

సమస్య మీది... పరిష్కారం మాది

- కలెక్టర్‌కు నేరుగా అందుతున్న ఫిర్యాదులు
- 13,392 వినతులను పరిష్కరించిన అధికారులు
- జగనన్నకు చెబుదాంకు తరలివస్తున్న జనం



స్పందనలో సమస్యలు తెలుసుకొంటున్న కలెక్టర్, అధికారులు (ఫైల్)

కడప సెవెన్ రోడ్స్: వినతుల పరిష్కార వేదిక.. స్పందనతో ప్రజల సమస్యలు సత్వరమే పరిష్కారం అవుతున్నాయి. తెదేపా హయాంలో స్పందనలో ఫిర్యాదు చేసినా తగిన పరిష్కారం లభించక జనం చొరవ చూపలేదు. ఇది తెలుసుకున్న సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి స్పందనతోపాటు 1902 హెల్ప్‌లైన్, జగనన్నకు చెబుదాం, ఆన్‌లైన్ గ్రీవెన్స్ పేరుతో పలు వేదికలను ఫిర్యాదుల స్వీకరణకు ఏర్పాటు చేశారు. ప్రభుత్వ పథకాలు, భూ సంబంధిత, ఇతరత్రా సమస్యలతో సామాన్యులకు సత్వరమే న్యాయం జరుగుతోందనడానికి ఆరు నెలల్లో లభించిన పరిష్కారమే అద్దం పడుతోంది.

- జిల్లాలో అధికారిక గణాంకాల ప్రకారం గత ఆరు నెలల నుంచి ప్రజల సమస్యలపై వచ్చిన ఫిర్యాదులకు పరిష్కారం లభిస్తోంది. సాక్షాత్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దీన్ని ప్రాధాన్యతాంశంగా పరిగణిస్తుండడంతో క్షేత్ర స్థాయికి అధికార యంత్రాంగం పరుగులు పెడుతోంది. మండల, జిల్లా, రాష్ట్ర, సీఎంఓ స్థాయిల్లో ప్రాజెక్టు మానిటరింగ్ యూనిట్లు ఏర్పాటు చేశారు. ఇప్పుడు జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని ప్రతి బుధ, శుక్రవారాల్లో మండల స్థాయిల్లో నిర్వహిస్తున్నారు. 2023 మే, 9వ తేదీ నుంచి ఇప్పటివరకు జిల్లాలోని 72 ప్రభుత్వ శాఖలకు బాధితుల నుంచి 14,857 వినతులు వచ్చాయి. వీటిలో 13,392 అర్జీలను ఇప్పటికే అధికారులు పరిష్కరించారు. మరో 1465 వినతుల పరిష్కారం ప్రోగ్రెస్‌లో ఉంది. శాఖల వారీగా విశ్లేషిస్తే రెవెన్యూ శాఖకు అత్యధికంగా 4972 అర్జీలురాగా, 3978 పరిష్కరించారు.

అధికంగా భూ సమస్యలే

స్పందనకు వచ్చే వినతులను పరిశీలిస్తే 70 శాతం భూ సమస్యలే ఉన్నాయి. 50 శాతానికి పైబడి భూమి ఆన్‌లైన్ చేసే విషయంలో నిర్లిప్తతకు సంబంధించినవే. జిల్లా వ్యాప్తంగా జాతీయ రహదారులు, ఇతర అభివృద్ధి పనులు జరగడంతో కొన్ని ప్రాంతాల్లో భూముల విలువ బాగా పెరిగింది. భూ సేకరణలో కోల్పోయిన భూమి ఆన్‌లైన్‌లో ఉంటేనే నష్ట పరిహారం అందుతోంది. దీంతో బాధితులు తమ భూములు ఆన్‌లైన్‌లో నమోదు కాలేదన్న సమస్యలే అధికంగా ఇచ్చారు. ఇక చుక్కల భూములు, ఇనాం భూముల సమస్యలు అధికంగా వచ్చాయి.

ఎప్పటికప్పుడు పరిష్కారం

స్పందనకు వచ్చిన ప్రజా వినతులు బియాండ్ ఎస్ఎల్ఏలో చేరకుండా అధికారులు జాగ్రత్తలు పాటిస్తున్నారు.రీ ఓపెనింగ్ లేకుండా చూస్తున్నారు. పారదర్శకంగా విచారణ చేసి అర్జీదారుడు సంతృప్తి చెందేలా క్షేత్ర స్థాయిలో పరిష్కరిస్తున్నారు. మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్‌కు సంబంధించి 1758 వినతులు రాగా, 1681 పరిష్కరించారు. మరో 77 వివిధ దశల్లో ఉన్నాయి. హౌసింగ్ కార్పొరేషన్‌కు వచ్చిన 1506 అర్జీలలో 1465, పంచాయతీరాజ్‌శాఖకు 1225 రాగా 1182 పరిష్కరించారు. పోలీసు శాఖకు వచ్చిన 1028 వినతుల్లో ఇప్పటికే 978 పరిష్కారమయ్యాయి. ఇవి గాక 12 శాఖలకు ట్రిపుల్ డిజిట్, 23 శాఖలకు డబల్ డిజిట్, 32 శాఖలకు సింగిల్ డిజిట్‌లో వినతులు వచ్చినట్లు అధికార గణాంకాలు పేర్కొంటున్నాయి.

గత పాలకుల నిర్లక్ష్యం

తెదేపా హయాంలో ప్రతి సోమవారం నిర్వహించిన మీ కోసం కార్యక్రమంలో అర్జీలు వచ్చినా పరిష్కారానికి చొరవ చూపలేదు. కలెక్టరేట్‌కు వచ్చే వాటిని రొటీన్‌గా ఆయా శాఖలకు పంపడం, మానిటరింగ్ లేకపోవడంతో ఎక్కడ వేసిన గొంగళి అన్నట్లు ఉంది. ప్రతిపక్ష నేత హోదాలో వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి పాదయాత్ర సందర్భంగా ప్రజలు పలు సమస్యలు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. అందులో 90–95 మ్యాన్ మేడ్ ఇష్యూస్ అని తెలుసుకున్నారు. ఫెయిర్ గవర్నమెంట్ ఉన్నప్పుడు వాటికి నాణ్యమైన పరిష్కారం అందించగలదని విశ్వసించారు. ఆయన సీఎం అయ్యాక 'స్పందన' ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ఎంతో ప్రాధాన్యం ఇచ్చారు. ఇంప్రూవైజ్డ్ వెర్షన్‌గా జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి 2023 మే, 9న శ్రీకారం చుట్టారు. నేరుగా ముఖ్యమంత్రి కార్యాలయం దీనిని పర్యవేక్షిస్తోంది.

క్లుప్తంగా

రేషన్ బియ్యం పట్టివేత

చింతకొమ్మదిన్నె : మండలంలోని తాడిగొట్ల గ్రామం వద్ద అక్రమంగా తరలిస్తున్న 30 సంచుల రేషన్ బియ్యాన్ని ఆదివారం విజిలెన్స్, రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకుని సీకే దిన్నె పోలీస్ స్టేషన్‌లో అప్పగించినట్లు ఎస్‌ఐ బి.శ్రీనివాసులురెడ్డి తెలిపారు. అక్రమంగా రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న అర్జున్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశామన్నారు.

వ్యక్తిపై దాడి

కడప అర్బన్ : కడప నగరంలోని బళ్లారి రోడ్డులో నివాసం ఉంటున్న ఓ కార్పొరేటర్ తన ఇంటిని కాలువపై నిర్మిస్తున్నాడంటూ షేక్ షకీల్‌బాషా నగరపాలక సంస్థ వారికి, జాయింట్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. కార్పొరేటర్ స్నేహితుడైన ఆరీఫ్ మధ్యవర్తిగా వెళ్లి షేక్ షకీల్‌బాషాను ఫిర్యాదు వాపసు తీసువాల్సిందిగా అడిగాడు. ఈ క్రమంలో వారి మధ్య వాగ్వాదం జరిగింది. ఈ నేపథ్యంలో షకీల్ బాషాపై ఆరీఫ్ దాడి చేశాడు. బాధితుడు షకీల్ బాషా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు కడప టూటౌన్ ఎస్‌ఐ జయరాముడు తెలిపారు.

రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి



కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప–కనుమలోపల్లె రైల్వేస్టేషన్ల మధ్య గుర్తు తెలియని వ్యక్తి(35) రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే సీఐ నాగార్జున తెలిపారు. ఆయన కథనం మేరకు మృతుడు ఎర్రటి టీ షర్టు, లోయర్ ధరించి ఉన్నాడన్నారు. గుర్తించిన వారు కడప రైల్వే సీఐ ఫోన్ 9440627398, ఎస్‌ఐ 9440900811 నంబరుకు సమాచారం అందించాలన్నారు.

ఆర్టీసీ ఉద్యోగులు ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి

మదనపల్లె సిటీ: ఉద్యోగులు ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని ఆర్టీసీ కడప హాస్పిటల్ సీనియర్ మెడికల్ ఆఫీసర్ శ్రీకాంత్ అన్నారు. ఆదివారం స్థానిక ఆర్టీసీ–2 డిపో కార్యాలయంలో ఆదర్శ ఉద్యోగుల అభినందన సభ ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ ఆరోగ్యం బాగుంటేనే ఉద్యోగం చేయగలుగుతామన్నారు. తరచూ వైద్య పరీక్షలు చేసుకోవాలని సూచించారు.

కాలుష్యం కాదు.. కాంతులు కావాలి

- గ్రీన్ దీపావళి కోసం 'సుప్రీం' సూచనలు
- పర్యావరణ హితంగా పండుగ

కడప కల్చరల్ : దీపావళి పండుగ అన్ని వయస్సులు, అన్ని వర్గాల వారికి ఆనందాన్ని ఇస్తుంది. ఈ సంతోషాల పండుగ నిర్వహణ వెనుక ప్రమాదాలు కూడా చోటు చేసుకుంటున్నాయి. అలాగాక పండుగ ఆనందాన్ని పూర్తిగా ఆస్వాదించేందుకు పర్యావరణ హితంగా నిర్వహించుకోవాలన్నది పెద్దల ఆలోచన. పండుగ కాలుష్య కారకం కాకూడదని దీపావళి కాంతులు మాత్రమే చాలునని పేర్కొంటున్నారు. ఈ మేరకు పర్యావరణ నిపుణులు సుప్రీం కోర్టును ఆశ్రయించగా.. గ్రీన్ దీపావళిని నిర్వహించాలని కోర్టు సూచించింది. పండుగ రోజున కాల్చే టపాసుల ద్వారా వచ్చే కాలుష్యం ప్రమాదకరమైందని.. ఇకపై కాలుష్యాన్ని కలిగించే టపాసులను వినియోగించకూడదని.. భారీ శబ్దాలు చేసే వాటిని కూడా దూరంగా ఉంచాలని కోర్టు సూచించింది. ప్రత్యేకించి ఈ పండుగ రోజులలో రాత్రి 8 గంటలనుంచి 10 గంటల వరకు మాత్రమే బాణసంచా కాల్చాలని కూడా తీర్పులో ఆదేశించింది. అయితే దక్షిణాది రాష్ట్రాల ప్రత్యేక పరిస్థితులు గమనించి కోర్టు రోజులో ఏవైనా రెండు గంటలపాటు కాల్చుకోవచ్చని సడలింపు ఇచ్చింది. ఈ దీపావళికి పర్యావరణ హితమైన టపాసులు మార్కెట్‌లోకి అందుబాటులోకి వచ్చాయి. ది కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ ఆఫ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ సెంటర్ ఏకో ఫ్రెండ్లీ గ్రీన్ టపాసులను అందుబాటులోకి తెచ్చింది. భారీ శబ్దాల స్థానంలో ఫ్లవర్ పార్ట్స్, పెన్సిల్స్, భూ చక్రాలు, స్పార్క్‌లర్‌ల స్థానాలలో కాకరొత్తులు, చిచ్చుబుడ్లు మాత్రమే కాల్చుకోవాలని సూచించింది. వీటిని వాడటంతో శబ్ద కాలుష్యాన్ని చాలా మేరకు తగ్గించవచ్చని పర్యావరణవేత్తలు సూచిస్తున్నారు.

ఇలాగైతే సురక్షితం



మట్టి దీపాలు, కొవ్వొత్తులు, విద్యుత్ దీపాలను వెలిగించడం మంచిదని.. నెయ్యి దీపాలు వెలిగిస్తే ఆక్సిజన్ కూడా ఎక్కువగా వెలువడుతుందని.. కనుక ఇలాంటి దీపాలు వెలిగించడమే మంచిదని పెద్దలు సూచిస్తున్నారు. టపాసులు ఇళ్ల లోపల కాల్చకూడదని.. దీంతో విష వాయువులు ఇళ్ల మూలల్లో నిలిచిపోయి చాలా రోజులు ఆరోగ్యంపై ప్రభావం చూపుతాయి. సరిగా కాలనివి, సగం కాలిన టపాసులను వదిలేయాలి. మరోసారి కాల్చుదామని దగ్గరికి వెళితే ఆకస్మాత్తుగా పేలే ప్రమాదం ఉందంటున్నారు. కాటన్ దుస్తులు, కళ్లజోడులు, బూట్లు వేసుకోవడం మంచిదని చెబుతున్నారు.

ప్రమాదాలకు అవకాశం

పండుగ సంప్రదాయంలో భాగంగా టపాసులు కాల్చుకుంటాం. కానీ ఆదమరిస్తే ఆ సరదా మనకే శాపంగా మారే ప్రమాదం ఉంది. టపాసులలో కొన్ని రకాలు ప్రమాదకరమైనవి. పూర్తిగా విషపూరితమైనవి ఉన్నాయి. ఇలాంటి వాటిని కాల్చితే మన ప్రమాదాన్ని మనమే సృష్టించుకున్నట్లు అవుతుంది. ఇలాంటి టపాసుల తయారీలో వాడే రసాయనాలు, లోహాలు విషపూరితమైనవి. పలు రసాయనాల సమ్మేళనంతో చేసిన వీటిని కాల్చితే గాలి, శబ్దం కాలుష్యమవుతుంది. కాలుష్య నియంత్రణ మండలి ఆదేశాల మేరకు ఈ ఏడాది పెద్ద నగరాలలో శబ్ద కాలుష్యంతోపాటు వాయు కాలుష్యాన్ని కూడా లెక్కకట్టనున్నారు. పండుగకు ముందు, తర్వాత కాలుష్యాన్ని నమోదు చేయనున్నారు. పర్యావరణ హిత దీపావళిని జరుపుకోవాలంటూ అవగాహన కల్పిస్తున్నారు. ప్రసార మాధ్యమాల ద్వారా ప్రచారం చేస్తున్నారు.

రసాయన సమ్మేళనాలు

బొగ్గు, పొటాషియం, నైట్రేట్, సల్ఫర్ ఇలాంటి రసాయనాల సమ్మేళనంతో జరిగే చర్యలవల్ల గాలి, విషపూరితమై క్యాన్సర్‌ను కలిగిస్తుంది. అల్యూమినియం ద్వారా స్పార్కులర్స్ వస్తాయి కనుక వాటిని ఎక్కువగా వాడతారు. అవి చర్మానికి తాకితే దద్దుర్లు వచ్చి నొప్పిని కలిగిస్తాయి. అనారోగ్యం కలుగుతుంది. స్ట్రోమియం శరీరంలోని కాల్షియం స్థానాన్ని ఆక్రమిస్తుంది. ఇది కూడా విషపూరితమైనది.. ఇథీయం ఎరుపు రంగు వచ్చేందుకు వాడుతారు. ఇది మండినప్పుడు విష వాయువులు వెలువడతాయి. బేరియంను ఆకుపచ్చ రంగు కనిపించడానికి వాడతారు. ఇది శ్వాసకోశ వ్యాధులను కలిగిస్తుంది. సల్ఫర్ ద్వారా సల్ఫ్యూరిక్ ఆమ్లం దానివల్ల వాతావరణ కాలుష్యం, జల వనరుల కాలుష్యం కలుగుతాయి. జిగురు, పేపర్‌లతో చేసిన టపాసులను కాల్చితే కళ్లు, ముక్కులలో మంట, గొంతు, తలనొప్పి, వికారం కలుగుతాయి. కాలేయం, మూత్ర పిండాలు, నాడీ వ్యవస్థ దెబ్బతింటుంది. సీసంతో చేసిన టపాసులతో చిన్నారులు మానసిక వికలాంగులయ్యే ప్రమాదం ఉంది. మెగ్నీషియం టపాసులు పొగ వెదజల్లడంవల్ల శ్వాస సమస్యలు ఎదురవుతాయి. జ్వరం వచ్చే ప్రమాదం ఉంది. జింక్ ద్వారా వచ్చే కాంతి కళ్లకు ప్రమాదం, మాంగనీస్ కలిపిన టపాసుల పొగ నేరుగా శరీరంలోకి చేరి నరాల బలహీనత, నిద్రలేమి, భావోద్వేగం, పక్షవాతం వచ్చే ప్రమాదం ఉంది. కాడ్మియం మూత్రపిండాలను దెబ్బతీస్తుంది. రక్తహీనత, రక్తపోటు పెరుగుతాయి. ఎముకలు గట్టిదనం తగ్గుతాయి. భాస్వరం వాడిన టపాసులతో కేంద్ర నాడీ వ్యవస్థ దెబ్బతింటుంది. కాలేయం పనితీరు కుంటుపడుతుంది. కంటికి నష్టం కలుగుతుంది. సల్ఫర్ ద్వారా ఊపిరితిత్తుల వ్యాధులు కలుగుతాయి. నైట్రేట్ ద్వారా మత్తు కలగడం, తిమ్మిర్లు రావడం, వాంతులు, విరేచనాలు, మూర్ఛ సమస్యలు తలెత్తుతాయి. నోటి ద్వారా గాలి ఊపిరితిత్తులకు వెళ్లి అనారోగ్యం పాలు చేస్తుంది. రక్తపోటు పెరుగుతుంది. తలనొప్పి కూడా వస్తుంది. ఇవే కాక పొగలు రావడానికి వాడే రూబిడియం, సల్ఫర్, యాంటీమిని, స్ట్రాంటియం, టైటానియం, మెటల్, జింక్‌ల వినియోగం కూడా ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుంది.

హార్సిలీహిల్స్‌పై అరుదైన సాలీడు



అటవీ అతిథిగృహం గోడపై కనిపించిన అరుదైన సాలీడు

బి.కొత్తకోట : బి.కొత్తకోట మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్ ప్రత్యేకమైన మొక్కలు, కీటకాలు, వన్యప్రాణులకు ఆలవాలం. ప్రత్యేకమైన ఓ సాలీడు అటవీశాఖ అతిథి గృహం గోడపై ఉండటాన్ని ఆదివారం అటవీ అధికారులు గుర్తించారు. పోసిలోథెరియా రెగలిస్ అని పిలువబడే భారతీయ అలంకార చెట్టు సాలీడుగా దీన్ని చెప్పుకొంటారు. సాధారణ సాలీడు కంటే భిన్నంగా, పెద్దగా కనిపించే ఈ సాలీడు కొన్ని ప్రాంతాల్లోనే కనిపిస్తుంది. పసుపు, నలుపు, తెలుపు రంగుల్లో ఉండే ఈ సాలీడు పొడవు ఎక్కువ. ఇది హార్సిలీహిల్స్‌పై కనిపించడం చూస్తే వీటి సంతతికి చెందిన సాలీడు రకాలు ఇంకా ఉండవచ్చు. కొండపై అరుదైన మొక్కలను ఇప్పటికే ఉద్యాన పరిశోధక విద్యార్థులు గుర్తించిన విషయం తెలిసిందే.

చంద్రబాబు వ్యవసాయమే దండగ అన్నారు

- టీడీపీ నాయకులకు రైతుల గురించి మాట్లాడే అర్హతే లేదు
- గత నెల 20నే కేసీ కెనాల్ నీటిపై అధికారులతో మాట్లాడా
- ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి



నీటిపారుదల శాఖ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : నాడు చంద్రబాబు నాయుడు వ్యవసాయం దండగ అని ప్రకటించారు.. మళ్లీ ఆ పార్టీ నాయకులు రైతుల గురించి, వ్యవసాయం గురించి ఎలా మాట్లాడతారని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి ప్రశ్నించారు. స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఎమ్మెల్యే ఆదివారం నీరుపారుదల శాఖ అధికారులతో చర్చించారు. అనంతరం ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడుతూ గత నెల 20న రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గమనించి కేసీ కెనాల్ నీటి విడుదలపై జిల్లా కలెక్టర్‌తో మాట్లాడిన విషయాన్ని తెలిపారు. అనంతరం ఎస్‌ఈతో చర్చించామన్నారు. ఆ తర్వాత నుంచే కేసీ కాలువకు నీరు విడుదలైందని చెప్పారు. చంద్రబాబు హయాంలో ఎన్నో ఏళ్లు కేసీ కెనాల్‌కు నీరు అందక రైతులు ఇబ్బందులు పడిన విషయాన్ని మరిచిపోలేదన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో గడిచిన నాలుగేళ్లు పుష్కలంగా వర్షాలు పడ్డాయని, ఈ ఏడాది వర్షాభావ పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుంటున్నామన్నారు. రాజోలి ఆనకట్ట ద్వారా నీటి విడుదలను పెంచామని, రైతుల నుంచి డిమాండ్ ఎక్కువగా ఉండటంతో మైలవరం డ్యాం ద్వారా రాజుపాళెం రైతులకు నీరు విడుదల చేస్తున్నామని తెలిపారు. 2012లో శనగ రైతులు నష్టపోతే ఏళ్ల తరబడి చంద్రబాబు ప్రభుత్వం పరిహారం చెల్లించలేదని, తమ ప్రభుత్వంలో ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి 2019లో పరిహారాన్ని మంజూరు చేయించారన్నారు. తమ ప్రభుత్వంలో పంటలు దెబ్బతిన్న నెల రోజుల్లో రైతులకు పరిహారం చెల్లించామని ఎమ్మెల్యే తెలిపారు. కేవలం రైతులను రెచ్చగొట్టేందుకే టీడీపీ నేతలు ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారన్నారు. శ్రీశైలం డ్యాంలో, తుంగభద్ర డ్యాంలో నీరు తక్కువగా ఉందని అధికారులు ఎమ్మెల్యేకు తెలిపారు. ముచ్చుమర్రి, మల్లెవేముల ఎత్తిపోతల పథకాల ద్వారా నీరు తీసుకోవాల్సి ఉందని చెప్పారు. సమావేశంలో కేసీ కెనాల్ ఈఈ కె.తిరుమలేశ్వరరెడ్డి, డీఈ బ్రహ్మారెడ్డి, రాజుపాళెం ఇన్‌చార్జి ఎంపీపీ ఎస్‌ఏ నారాయణరెడ్డి, సచివాలయాల ఇన్‌చార్జి రాజశేఖర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జి గుద్దేటి రాజారాంరెడ్డి పాల్గొన్నారు.

కావ్య రచన కాదు.. ప్రతిభ ముఖ్యం

- వైవీయూ పాలకమండలి సభ్యుడు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి
- అవధాని నరాల రామారెడ్డికి గడియారం సాహితీ పురస్కారం ప్రదానం



గడియారం సాహితీ పురస్కారం అందుకుంటున్న నరాల రామారెడ్డి

ప్రొద్దుటూరు కల్చరల్ : ఎన్ని కావ్యాలు రచించామన్నది ముఖ్యం కాదు.. ప్రతిభకు పట్టం కట్టి సాహితీ లోకంలో చిరస్థాయిగా నిలవడం ముఖ్యం అని యోగివేమన విశ్వవిద్యాలయం పాలకమండలి సభ్యుడు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి అన్నారు. స్థానిక శ్రీకృష్ణ గీతాశ్రమంలో ఆదివారం రాత్రి రచన సాహిత్య వేదిక, గడియారం వారి కుటుంబం సంయుక్త ఆధ్వర్యంలో గడియారం వేంకటశేషశాస్త్రి 42వ సాహిత్య పురస్కార ప్రదాన సభను రచన సాహిత్య వేదిక అధ్యక్షుడు విహారి ఆధ్వర్యంలో నిర్వహించారు. అవధాని నరాల రామారెడ్డికి గడియారం వేంకటశేషశాస్త్రి 42వ సాహిత్య పురస్కారాన్ని ప్రదానం చేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నరాల రామారెడ్డి వెయ్యికిపైగా అవధానాలు చేశారని, అమెరికాలో అవధాన కౌస్తుభ బిరుదుతోపాటు ఎంతో మంది ఆయనను పలు అవార్డులు, బిరుదులతో సత్కరించారన్నారు. ఆయనకు గడియారం పురస్కారం ఇవ్వడం హర్షణీయమన్నారు. కేంద్ర సాహిత్య అకాడమి పురస్కార గ్రహీత డీకే చదువులబాబు మాట్లాడుతూ అవధాన రంగంలో విశిష్ట సేవలు అందించిన నరాల రామారెడ్డికి గడియారం సాహితీ పురస్కారం అందించడం అభినందనీయమని తెలిపారు. శతావధాని ఆముదాల మురళి మాట్లాడుతూ రామారెడ్డి అవధానం వేరు, మా శతావధానం వేరు అన్నారు. తొడగొట్టిన పండితుల మధ్య అవధానాన్ని అవలీలగా చేసి అందరి మన్ననలు పొందారన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో అనేక పట్టణాలు, నగరాల్లో అనేక అష్టావధానాలు నిర్వహించి, అమెరికాలో ఆటా, నాటా, తానా సంస్థల ద్వారా సన్మానాలు అందుకోవడం ఒక ఎత్తయితే, గడియారం వేంకటశాస్త్రి సాహితీ పురస్కారం అందుకోవడం ప్రత్యేకత సంతరించుకుందన్నారు. డాక్టర్ మూలె రామమునిరెడ్డి తన గురువైన రామారెడ్డి అవధానంలో దత్తపదులు, సమస్యలు, అప్రస్తుత అంశాలు ఎలా పూరించారనేది పద్య రూపంలో వివరించారు. రచన సాహిత్య వేదిక ఉపాధ్యక్షుడు గడియారం వెంకటశేషశర్మ, కార్యదర్శి డాక్టర్ భూతపురి గోపాలకృష్ణ శాస్త్రి, కార్యవర్గ సభ్యులు అన్నవరం రామ్‌కుమార్, నంద్యాల సురేష్ కుమార్, ముడియం కిశోర్ కుమార్, గడియారం కుటుంబీకులు, సాహితీవేత్తలు, సాహితీ అభిమానులు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో 16 గొర్రె పిల్లలు మృతి



కుక్కల దాడిలో మృతి చెందిన గొర్రెపిల్లలు

తొండూరు : మండలంలోని పాలూరు గ్రామానికి చెందిన పుల్లేరుపు ఓబయ్య అనే గొర్రెల కాపరికి చెందిన 16 గొర్రెపిల్లలు కుక్కలదాడిలో మృతి చెందాయి. ఆదివారం రోజుమాదిరిగానే గొర్రెలను మేత కోసం సమీపంలోని కొండ ప్రాంతానికి తోలుకొని వెళ్లాడు. ఆ సమయంలో గొర్రెల పాదిలో ఉన్న పిల్లలపై కుక్కలు దాడి చేయడంతో 16 గొర్రెపిల్లలు మృతి చెందాయి. దీంతో సుమారు రూ.లక్ష మేర నష్టం జరిగిందని బాధితుడు వాపోయాడు. ఈ విషయాన్ని పశు వైద్యాధికారులకు తెలియజేయగా పరిశీలించి జరిగిన నష్టాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు.

వేర్వేరు ఘటనల్లో ఇద్దరి ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : వేర్వేరు ఘటనల్లో కుటుంబ సమస్యల కారణంగా ఇద్దరు వ్యక్తులు ఆత్మహత్యాయత్నానికి పాల్పడి స్థానిక జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. నిమ్మనపల్లె మండలం రాచవేటివారిపల్లె పంచాయతీ ఎగువమాచిరెడ్డిగారిపల్లెకు చెందిన మునిస్వామి భార్య ఏ.గంగాభవాని(28) కుటుంబ సమస్యలతో ఆదివారం ఉదయం విషద్రావణం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. అదేవిధంగా మదనపల్లె మండలం బొమ్మనచెరువు పంచాయతీ కన్నెమడుగువారిపల్లెకు చెందిన మొగిలప్ప కుమారుడు కే.గంగులప్ప(50) కుటుంబ సమస్యలతో ఇంట్లోనే పురుగుమందు తాగాడు. ఆయా ఘటనల్లో కుటుంబ సభ్యులు బాధితులను మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. సంబంధిత పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వీరభద్రుడిని దర్శించుకున్న తెలంగాణ ఆర్టీసీ ఎండీ



వీరభద్రస్వామి సన్నిధిలో తెలంగాణ ఆర్టీసీ ఎండీ సజ్జనార్

రాయచోటిటౌన్ : రాయచోటి శ్రీ భద్రకాళీ సమేత వీరభద్రస్వామిని తెలంగాణ ఆర్టీసీ ఎండీ సజ్జనార్ దర్శించుకున్నారు. ఆదివారం ఆయనకు ఆలయ పాలక మండలి చైర్మన్ పోలంరెడ్డి విజయ, ఆలయ ఈఓ డీవీ రమణారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ పోలంరెడ్డి దశరథరామిరెడ్డిల ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం స్వామి వారికి, అమ్మవార్లకు ప్రత్యేకంగా అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఆయనకు తీర్థప్రసాదాలు అందించడంతో పాటు ఘనంగా సన్మానించారు.

ఆటోను ఢీకొన్న ట్రాక్టర్

చిన్నమండెం : మండలంలోని కేశాపురం గ్రామం చెక్‌పోస్టు సమీపంలో బోనమల రోడ్డు మార్గంలో జగనన్న కాలనీ వద్ద ఆదివారం ఆటోను ట్రాక్టర్ ఢీకొంది. ఈ సంఘటనలో కేశాపురం కస్పాకు చెందిన షబానా అనే మహిళకు కాలు విరిగి తీవ్రంగా గాయపడినట్లు ఎస్‌ఐ రమేష్‌బాబు తెలిపారు. సయ్యద్ మహమ్మద్ రసూల్ ఆటోలో కూలీలను ఎక్కించుకొని కేశాపురం చెక్‌పోస్టు మీదుగా వస్తుండగా ఎదురుగా వస్తున్న ఏపీ39ఎస్‌ఆర్ 9652 ట్రాక్టర్ ఆటోను ఢీకొంది. ఈ సంఘటనలో మహిళతో పాటు ప్రయాణికులకు గాయాలయ్యాయి. ఆటో డ్రైవర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

మహిళ ఆత్మహత్యకు కారణమైన ముగ్గురి అరెస్టు

రామసముద్రం : రామసముద్రం మండలం కాప్పల్లె గ్రామానికి చెందిన రాఘవరెడ్డి భార్య జ్యోతి(30) ఆత్మహత్యకు కారణమైన ముగ్గురిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటి స్థలం విషయమై అదే గ్రామానికి చెందిన రెడ్డెమ్మ, విజయకుమారి, కుమారిలు జ్యోతిని సూటిపోటి మాటలు అన్నారని ఆ కారణంగా జ్యోతి విషం తీసుకుందన్నారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిందన్నారు. కేసు దర్యాప్తులో భాగంగా రెడ్డెమ్మ, విజయకుమారి, కుమారిలను అరెస్ట్ చేశామని పేర్కొన్నారు.

రోడ్డుప్రమాదంలో గాయపడిన కార్మికుడు మృతి

మదనపల్లె : రోడ్డుప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ భవననిర్మాణ కార్మికుడు మృతిచెందిన సంఘటన శనివారం రాత్రి జరిగింది. పట్టణంలోని సొసైటీకాలనీకి చెందిన జయచంద్ర(30) భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఈనెల 2వతేదీ పనుల్లో భాగంగా కర్నాటకలోని రాయల్పాడుకు వెళ్లాడు. పనులు ముగించుకుని ద్విచక్రవాహనంలో ఇంటికి వస్తుండగా, రాయల్పాడు వద్ద వాహనం అదుపు తప్పి కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు అతడిని మదనపల్లె ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందాడు. ఆదివారం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. రాయల్పాడు ఎస్‌ఐ యోగీష్‌కుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

90 మామిడి చెట్లు నరికివేత



నరికివేసిన మామిడిచెట్లు

వేంపల్లె : స్థానిక రాజీవ్‌కాలనీ సమీపంలో ఉన్న 90 మామిడి చెట్లను నరికివేశారు. ఆదివారం బాధితుడి తమ్ముడి కుమారుడు కొమ్మద్ది వెంకటసుబ్బయ్య పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. కొమ్మద్ది పెద్దసుబ్బన్నకు సర్వే నెంబరు 1367/4 లో 1.40 ఎకరాల్లో డీకేటీ భూమి ఉంది. అయితే కొమ్మద్ది పెద్దసుబ్బన్నకు పిల్లలు లేకపోవడంతో తమ్ముని కుమారునికి ఇచ్చాడు. తమ్ముని కుమారుడైన వెంకటసుబ్బయ్య గత 8 నెలల క్రితం మామిడి చెట్లను సాగుచేశారు. అయితే తన భూమి పక్కనే ఉన్న పార్వతి భర్తకు మిలటరీ కోటాకింద 4 ఎకరాలు భూమి ఉంది. ఆమె కుమారుడు సునీల్ ఆ భూమి కూడా తమదేనని సాగుచేసిన 90 మామిడి చెట్లను నరికివేశాడు. తమ పెద్దల కాలం నుంచి 32 సంవత్సరాలుగా ఈ భూమిని సాగు చేసుకుంటున్నామని, ఇటీవల బోరు కూడా వేసి మోటారు విద్యుత్ లైన్ బిగించామని బాధితుడు తెలిపారు. ఇప్పుడిప్పుడే మామిడి చెట్లు బతికి కొమ్మలు వేస్తున్నప్పుడు శనివారం రాత్రి ఎవరూలేని సమయంలో మామిడి చెట్లను నరికివేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇది తమ భూమి పక్కన వారే చేసుంటారని ఆరోపించారు.

హాకీ స్టేట్ చాంపియన్‌లుగా కడప జట్లు



హాకీ స్టేట్ చాంపియన్‌లుగా నిలిచిన వైఎస్సార్ జిల్లా అండర్–17 బాలికల జట్టు, బాలుర జట్టు

కడప స్పోర్ట్స్: అనకాపల్లి జిల్లాలో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ ఎస్‌జీఎఫ్ అండర్–17 అంతర్ జిల్లాల హాకీ టోర్నమెంట్ చాంపియన్‌లుగా వైఎస్‌ఆర్ జిల్లా జట్లు నిలిచాయి.

ఆదివారం నిర్వహించిన ఫైనల్ మ్యాచ్‌లో కడప బాలుర జట్టు విశాఖపట్నంపై 2–0 గోల్స్ తేడాతో విజయం సాధించి చాంపియన్‌గా నిలిచింది. అదే విధంగా బాలికల జట్టు అనంతపురం జట్టుపై 2–0 తేడాతో విజయం సాధించి స్టేట్ చాంపియన్‌గా నిలిచింది. విజేతలుగా నిలిచిన బాలబాలికల జట్లకు నిర్వాహకులు మెడల్స్, ప్రశంసాపత్రాలు అందజేశారు. వీరి వెంట వైఎస్‌ఆర్ క్రీడాపాఠశాల శిక్షకుడు అనిల్ ఉన్నారు.